క్లుప్తంగా

దొంగరావిపాలెంలో ఉపాధి పనులు



దొంగరావిపాలెంలో పంట కాలువలను బాగు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పెనుగొండ: మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. పంట కాలువలు, పంట బోదెలు, చెరువుల పూడిక తీత తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం మండలంలోని దొంగరావిపాలెం గ్రామంలో పంటకాలువలో పూడికతీత పనులను ఉపాధి కూలీలతో చేపట్టారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పంట కాలువలో చెత్త, తూడు, గుర్రపు డెక్కతో సాగునీటి సరఫరా ఆటంకం కలుగుతుంది. ఉపాధి హామీ పనుల్లో పంట కాలువలను బాగు చేయాలని రైతుల అభ్యర్థన మేరకు ఉపాధి కూలీలతో రెండు రోజుల నుంచి కాలువలలో పూడికతీత పనులు చేయిస్తున్నారు.

స్కిల్స్ పెంచుకునేందుకు ప్రత్యేక శిక్షణ



బసవరాజును సన్మానిస్తున్న సంఘ సభ్యులు

యలమంచిలి: ఆడియో, వీడియో టెక్నీషియన్స్ స్కిల్స్ పెంచుకునేందుకు ప్రభుత్వం అందించే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు అనుసంధానంగా యూనియన్‌తో కలిపి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పాలకొల్లు ఆడియో, వీడియో టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మానెం బసవరాజు చెప్పారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మెయిన్‌రోడ్‌లోని సూర్య గణపతి ఎలక్ట్రానిక్స్ షాపులో నిర్వహించారు. ఈ సందర్భంగా గత 5 సంవత్సరాల నుండి యూనియన్‌ను అభివృద్ధి పథం నడిపిస్తున్న అధ్యక్షుడు మానెం బసవరాజును సభ్యులు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకుడు బొడ్డపాటి సూరి పండు, నంబూరి పుల్లయ్య, ఎస్.వెంకటరత్నం, గుద్దటి కేదారేశ్వరుడు, వట్టి శ్రీనివాసరావు, బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పెనుగొండ: మండలంలో సోమవారం నుంచి 15వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి. సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్నపిల్లల కోసం ఈ నెల 5 నుంచి 8 వరకూ, 12 నుంచి 15వ తేదీ వరకు మండలంలో వివిధ అంగన్‌వాడీ, స్కూల్స్‌లో ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని చిన్నపిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రూతు కుమారి

పెనుగొండ: కిశోర బాలిక వికాస శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూతు కుమారి అన్నారు. సిద్ధాంతం పంచాయతీ వద్ద కిశోర బాలికల వికాసంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం కిశోర బాలికల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వై.కిశోర్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తణుకులో స్టీల్, ఇత్తడి దుకాణాలపై దాడులు

తణుకు అర్బన్: తణుకులో స్టీల్, ఇత్తడి సామాన్ల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న స్టీల్, ఇత్తడి దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సామగ్రిపై కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్సై కె.సీతారాం, తూనికలు కొలతల అధికారి టి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు పట్టణ పరిధిలోని శ్రీనాగరత్న స్టీల్ సెంటర్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇత్తడి షాపు, స్నేహ మెటల్ అండ్ జనరల్ స్టోర్స్, కారుమూరి సూర్యనారాయణమూర్తి అండ్ సన్స్, దుర్గ శ్రీనివాస మెటల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశారు. తూనికలు, కొలతల చట్ట ప్రకారం లేని సామగ్రి విక్రయిస్తున్న దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోల్‌మాల్

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన విక్రయాలు
- లోపాయికారీగా దళారులకే అమ్ముతున్న వైనం



కొప్పర్రులో పట్టుబడికి సిద్ధంగా ఉన్న ధాన్యం

నరసాపురం రూరల్: తీరప్రాంతమైన నరసాపురంలో వరి మాసూళ్లు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రబీ ధాన్యం కొనుగోళ్లు 60 శాతం పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల కారణంగా ధాన్యం కొనుగోలులో దళారులు రాజ్యమేలుతున్నారు. నరసాపురంలో రబీ విస్తీర్ణం 14 వేల ఎకరాలు ఉండగా 27 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. అయితే ప్రస్తుతం నరసాపురంలో కేవలం 14వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో దళారులు దందాకు దిగారు. వారు ఎంత ధర నిర్ణయిస్తే అంతకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ పక్క ఈదురు గాలులతో కూడిన వాతావరణం రోజూ భయపెట్టడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో దళారులు చెప్పిన ధరకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

నరసాపురం మండలంలో సాగు ఇలా

మండలంలో ఎంటీయూ 1121, 1156, ఆర్‌ఎన్‌ఆర్ 126, 1153 వరిరకాలను సాగు చేశారు. రబీ సీజన్ సాగుకు అనువుగా ఉండడంతో కామన్ రకమైన 1121ని ఎక్కువ మంది సాగు చేశారు. అయితే ఈ రకం సాధారణ రకంగా ఉంది. నరసాపురం మండలంలోని 28 గ్రామాల్లో 25 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఆక్వా జోన్ మినహా మిగిలిన ప్రాంతాల్లో 15 క్లస్టర్‌లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా రైతులు దళారులనే ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఉండడంతో దీంతో తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.



మంగళగుంటపాలెంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న దృశ్యం



ధాన్యం లోడును మిల్లుకు తరలిస్తున్న దృశ్యం

తేమ శాతం పేరుతో మోసాలు

ఏ గ్రేడు రకానికి క్వింటాల్‌కు రూ.2,320 ధర ఉండగా, తేమ కారణంగా ధాన్యాన్ని 75 కేజీల ధాన్యం బస్తాను రూ.1600 నుంచి రూ.1,700 కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం పేరుతో దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ధాన్యం పట్టుబడి, హమాలీ చార్జీలు సగటున బస్తాకు రూ.80 ఖర్చు అవుతుంది. అయితే గత నెల 18, 26వ తేదీల్లో రెండు విడతలుగా ధాన్యం అమ్మకాలు సాగించిన చామకూరిపాలెం గ్రామానికి చెందిన రైతు గుబ్బల మోహనరావుకు ఇంత వరకూ హమాలీ ఖర్చులు జమ కాలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయలని రైతులు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారడంతో రైతుకు అన్యాయం

ఓ వైపు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, మరో పక్క దళారీ వ్యవస్థ వెరసి రైతులకు అన్యాయం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందితో కలసి మిల్లర్లు దళారీ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వడంతో నేరుగా మిల్లుకు అమ్ముకుందామన్న రైతుకు న్యాయం జరగడం లేదు. ఇదిలా ఉంటే మాగ్రామం ఎల్బీచర్లలో ఆర్బీకే లోని కియోస్క్ మిషన్ పని చేయక పోవడంతో మరింత జాప్యం జరుగుతోంది. తూర్పుతాళ్లు రైస్ మిల్లులో రైతులను పక్కన పెట్టి వారికి కావాల్సిన దళారీల వాహనాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాను.

– బొడ్డు ఆశిష్‌కుమార్, ఎల్బీచర్ల

నచ్చిన పద్ధతిలో అమ్మకాలు

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతు సేవా కేంద్రాల ద్వారా జరుగుతోంది. ఇప్పటి వరకూ మిల్లర్లు 14 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. రైతులు రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకం జరిపి మిల్లుకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం వెల్లడించిన విధంగా సాధారణ రకానికి క్వింటాళ్ల ధర రూ. 2,300, ఏ గ్రేడు రకానికి రూ. 2,320 ధరఉంది.

– ఎం.జాన్సన్, వ్యవసాయ శాఖ అధికారి, నరసాపురం

ఈ-శ్రమ్ పోర్టల్‌పై అవగాహన అవసరం



అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

యలమంచిలి: అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ పోర్టల్ పై అవగాహన కల్పించాలని పాలకొల్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ ఆదేశించారు. పాలకొల్లు పరిధిలోని కార్మిక శాఖ, పోలీస్ శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో శనివారం ఆయన పాలకొల్లు కోర్టులో సమావేశం నిర్వహించారు. కార్మిక వారోత్సవాల్లోభాగంగా అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఆయా శాఖలు తీసుకునే చర్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బాల కార్మికులను గుర్తించి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురైతే లీగల్ సర్వీసెస్ కమిటీ సేవలు వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో పాలకొల్లు పట్టణ సీఐ కోలా రజనీకుమార్, ఏరియా ఆసుపత్రి డాక్టర్ రవి కుమార్, లేబర్ ఇన్‌స్పెక్టర్ శర్మ పాల్గొన్నారు.

చవాకుల నరేష్‌కు ఎన్టీఆర్ కీర్తి పురస్కారం



ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకుంటున్న చవాకుల నరేష్

యలమంచిలి: పాలకొల్లు చవాకుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చవాకుల నరేష్‌కు శనివారం విజయవాడలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ డాక్టర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని అందజేసింది. పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో చవాకుల ట్రస్ట్ ద్వారా నరేష్ చేస్తున్న సేవలను గుర్తించి అవనిగడ్డ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు.

సంచుల కొరతతో అవస్థలు



పెనుమంట్ర రైతుసేవా కేంద్రం గోడౌన్‌లో పనికి రాకుండా ఉన్న సంచుల గుట్టలు



మార్టేరు- అత్తిలి స్టేట్ హైవేపై ఆలమూరు వద్ద రోడ్లపై నెట్లు కట్టి బరకాలు కప్పిన దృశ్యం



లంకలకోడేరు-కానూరు రోడ్డులో ఓడూరు వద్ద రోడ్డు మార్జిన్‌లో వేసిన ధాన్యం బస్తాలు

పెనుమంట్ర: మండలంలో 6,400 మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదుకాగా, 33వేల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని లక్ష్యంగా నిర్ణయించి 8.26 లక్షల సంచులు అవసరం అవుతాయని నిర్ణయించారు. ఇప్పటి వరకు 7.16 లక్షల సంచులు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేసినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. అయితే ఇప్పటి వరకు 2300 రైతులు 18,300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 4.55 లక్షల సంచులతో మిల్లులకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా సరఫరా చేసిన సంచులలో 2.61 లక్షల సంచులు రైతుల వద్ద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే చాలా మంది రైతులు ధాన్యం మాసూళ్లు చేసి, సంచులు లేక తమ ధాన్యాన్ని రోడ్లపైనే రాశులుగా పోసి, వాతావరణ పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో బరకాలు కప్పి రోడ్లపైనే రాశులుగా పోసి ఉంచారు. స్టేట్ హైవే రోడ్డుపై మార్టేరు నుంచి మంచిలి వరకు లంకలకోడేరు–కానూరు రోడ్డుపై నెలమూరునుంచి కత్తవపాడుకు అనేకం ధాన్యం రాశులు సంచులు నెట్టిలు కట్టిన ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయి.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: మార్టేరులో పేపర్ క్రాఫ్ట్స్‌ను చూపుతున్న విద్యార్థులు

నరసాపురం: చిన్నారులకు నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను శిక్షణ తరగతులకు పంపించి తల్లిదండ్రులు సహకరించాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పండా త్రినాథ్, లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి కోరారు. శనివారం శిక్షణ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించామని చెప్పారు. సోమవారం నుంచి పూర్తిస్థాయి శిక్షణ ఉంటుందని వివరించారు. పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్విజ్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. పాఠశాలలు ప్రారంభించే వరకూ శిబిరం ఉంటుందని వివరించారు.

స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన

పెనుమంట్ర: మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పిల్లలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజూ రిటైర్డు ఆంగ్ల ఉపాధ్యాయురాలు పడాల సువర్ణగౌరి స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇస్తూ పిల్లలకు పేపర్ క్రాఫ్ట్స్ తయారీపై అవగాహన కలిస్తున్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రిటైర్డు తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి పిల్లలకు భగవద్గీత శ్లోకాల పఠనంపై ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పిల్లలకు ఆరోగ్య సంబంధ విషయాలను బోధిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మానవత కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, గ్రంథాలయాధికారి పీటీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

6న చాంబర్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు

యలమంచిలి: సంధ్య మెరైన్స్, జగదీష్ మెరైన్స్ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కేవీ నరసింహారావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఆక్వా కల్చర్, ఐటీఐ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇతర వివరాలకు 99120 46234, 94935 03441 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

వేములదీవి వెంకన్నకు చందనాలంకరణ



చందనాలంకరణలో స్వామివారు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడపలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు నిర్వహించిన ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో నిర్వహించిన భజన భక్తులకు విశేషంగా అలరించింది.

పక్షుల దాహార్తి తీర్చడానికి కుండీల బహూకరణ



కుండీలు అందజేస్తున్న నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు

యలమంచిలి: మూగజీవాల సంక్షేమానికి పాలకొల్లు నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ చేస్తున్న సేవలు ఎనలేనివని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు గంజనబోయిన మల్లేశ్వరరావు అన్నారు. వేసవికాలం దృష్ట్యా పక్షులు, పశువులు వంటి మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు పాలకొల్లు నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు శనివారం స్థానిక పశువైద్యశాలకు బీజేపీ సీనియర్ నాయకుడు జక్కంపూడి కుమార్ చేతుల మీదుగా సిమెంట్ కుండీలను అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ నెస్ట్ కన్జర్వేషన్ సొసైటీ అధ్యక్షులు మనీష్ బృందం సేవలను కొనియాడారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ పి.జి. ఆర్.ఎస్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఎక్కడ ఉన్నా నిస్వార్థ సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వరదలు, తుఫాన్లు వంటి విపత్కర సమయాల్లో వారు అందజేసే సేవలు మరువరానివన్నారు. జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాలు, ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలు గురించి రెడ్‌క్రాస్ సిబ్బందిని అభినందించారు.

వీధుల్లో గ్రామసింహాల హల్‌చల్

- విచ్చలవిడిగా గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

యలమంచిలి: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు ప్రజలపై దాడి చేసి కరుస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో పంచాయతీ అధికారులు కుక్కలను పట్టుకుని చంపేవారు. బ్లూక్రాస్ సంస్థ ఆంక్షలతో కుక్కలను చంపడం మానివేసి పట్టుకుని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి వదిలేసి వచ్చేవారు. కానీ అది కూడా అధిక వ్యయప్రయాసలతో కూడిన పని కావడంతో ఈ మధ్య కాలంలో కుక్కలు పట్టుకోవడం మానివేశారు. దీంతో గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో కుక్క కాటుకు గురయ్యేవారు కూడా ఎక్కువయ్యారు. ఏ గ్రామంలో చూసిన వందల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. యలమంచిలి మండలంలోని యలమంచిలిలంక, శిరగాలపల్లి, యలమంచిలి, చించినాడ గ్రామాలలో కుక్కలతో పాటు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉంది. ఈ గ్రామాల్లో వందల సంఖ్యలో కోతులు సంచరిస్తున్నాయి. వారంలో కనీసం పది మంది కోతి దాడికి గురైన వ్యక్తులు యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నట్లు ఫార్మాసిస్ట్ మేడికొండ రామదాసు చెప్పారు.

25 రోజుల్లో 600 కేసులు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి గణాంకాలు పరిశీలిస్తే మొత్తం 595 మంది జంతువుల కాటుకు గురైనట్లు తెలుస్తోంది. జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 18 అర్బన్ పీహెచ్‌సీలు, 8 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల నుంచి ఈ నెలలో (ఏప్రిల్ ఒకటి నుంచి 25వ తేదీ వరకు) జిల్లా వైద్య శాఖాధికారి కార్యాయానికి వచ్చిన నివేదికల ప్రకారం 507 మంది కుక్క కాటుకు, 36 మంది పాము కాటుకు 52 మంది ఇతర జంతువుల కాటుకు గురైనట్లు రికార్డ్ అయ్యింది. అంటే జిల్లాలో సరాసరిన రోజుకు 20 మంది జంతువుల కాటుకు గురవుతున్నారు. కుక్క కాటుకు వేసే ఏఆర్‌వీ (యాంటీ రాబిస్ వ్యాక్సి) ఇంజిక్షన్‌లనే కోతి కాటుకు కూడా వేస్తారు. పాము కాటుకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వ్యాక్సిన్) వేస్తారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులో ఈ రెండు రకాల వ్యాక్సిన్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. వైద్యం అందుబాటులో ఉన్నా కుక్కలను కోతులను కంట్రోల్ చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కుక్కల సంతతి పెరగకుండా వాటిని పట్టుకుని ఆపరేషన్లు చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎక్కడా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.